క్లుప్తంగా

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

శాంతినగర్ : వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో లబ్ధిదారులకు గురువారం గొర్రెలు పంపిణీ చేశారు. గ్రామంలోని 8 మంది లబ్ధిదారులకు రెండో విడతలో 8 యూనిట్లు మంజూరయ్యాయని, 160 గొర్రెలు, 8 పొట్టేళ్లను పంపిణీ చేశామని వడ్డేపల్లి మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ పుష్పలత, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

రాజోళి: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ గోవిందురావ్ అన్నారు. గురువారం మండలంలోని ముండ్ల దిన్నెలో స్వచ్ఛ పర్యవేక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన పరిసరాలను పరిశీలించారు. వీధులు, డ్రెయినేజీలు పరిశుభ్రంగా ఉంచాలని, దాని కోసం గ్రామ పంచాయతీ చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. చెత్తను క్రమం తప్పకుండా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డుకు వెళ్లి చెత్త, వ్యర్థాలను ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నారనే విషయాలను అడిగి, సలహాలు, సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపుదాం

గద్వాల అర్బన్: బాల్య వివాహాలను రూపుమాపుదామని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు అన్నారు. గురువారం మండలంలోని పూడూరులో పంటపొలాల్లోని వ్యవసాయ కూలీలకు బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండని అమ్మాయిలకు వివాహం చేయడం నేరమన్నారు. పిల్లల ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, పిల్లలను ఎవరూ పనుల్లో పెట్టుకోరాదన్నారు.

తహసీల్దార్‌గా నరేందర్

గద్వాల అర్బన్: గద్వాల మండల తహసీల్దార్‌గా నరేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వనపర్తి జిల్లాలోని మదనాపూర్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తుండగా, బదిలీపై గద్వాలకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు డీటీలు, ఆర్ఐ, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు.

తహసీల్దార్‌కి సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్‌కు పూల బొకే అందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరబాబు, రామన్‌గౌడ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో మాజీ సర్పంచ్ వడ్డె శివశంకర్ బుధవారం పొలంలో పనులు చేస్తూ బ్రెయిన్ డెడ్ కావడంతో కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గురువారం ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు కిషోర్‌కుమార్, వెంకటేష్‌గౌడు నివాళులర్పించారు.

విద్యార్థులకు క్రీడలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15 సందర్భంగా విద్యార్థులకు క్రీడలు ప్రారంభించారు. గురువారం కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

మండలంలో భారీవర్షం

గట్టు : గట్టులో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో 46.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. గట్టు చెరువులోకి కాలువ ద్వారా నీరు రావడం ప్రారంభమైంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ పొలం పనుల్లో బిజీ అయ్యారు.

ఉండవల్లిలో 25.6 మి.మీ.

ఉండవెల్లి: మండలంలోని అని గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మండలంలో 25.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గద్వాల క్రైం: కొలువు రాలేదని తీవ్ర మనస్థాపానికి గురై పురుగు మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. మల్దకల్ మండల కేంద్రానికి చెందిన సురేందర్(24) ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన విద్యుత్ శాఖ పోటీ పరీక్షలో రెండు మార్కులు తక్కువగా వచ్చాయి. దీంతో తీవ్ర మనస్థాపం చెంది ఈ నెల 8వ తేదీన పట్టణ శివారులో పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని చికిత్స కోసం గద్వాల జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, గురువారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తుల వెల్లువ

కిటకిటలాడిన ఆన్‌లైన్ సెంటర్లు



అలంపూర్ మున్సిపాలిటీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ నిత్యానంద్



ధరూరు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు ఇచ్చేందుకు ఎగబడిన ప్రజలు

ధరూరు : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రభుత్వం అర్హులైన వారి నుంచి ఇంటి నిర్మాణ కోసం గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షలు ఇచ్చేందుకు ప్రకటన చేసిన నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. రెండు రోజులుగా వస్తున్న దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ తెలిపారు. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం జనం ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల వద్ద క్యూ కట్టారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ 10 కావడంతో మూడు రోజుల్లో సర్టిఫికెట్లను ఎలా తీసుకోవాలని, తహసీల్దార్ కార్యాలయంలో కనీసం మూడు నుంచి ఐదు రోజులు పడుతుందని ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంలోని ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు వివిధ సర్టిఫికెట్ల కోసం అధికంగా డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని, మరోసారి అలాంటి ఫిర్యాదులొస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి గృహలక్ష్మి పథకం కోసం గురువారం ఎంపీడీఓ కార్యాలయానికి 962 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. బుధవారం, గురువారం మొత్తం 1158 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీఓ పద్మావతి తెలిపారు.

మల్దకల్‌లో 1932 దరఖాస్తులు

మల్దకల్ : గృహలక్ష్మి పథకం కోసం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 1932 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు.

మండలంలో 1100 దరఖాస్తులు

మానవపాడు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి గురువారం గృహలక్ష్మి పథకం కోసం 1100 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రమణారావు తెలిపారు. దరఖాస్తుదారులు మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

గృహలక్ష్మి 926 దరఖాస్తులు

అలంపూర్ రూరల్ : మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల నుంచి గృహలక్ష్మి కోసం 926 దరఖాస్తులు వచ్చినట్లు గురువారం ఎంపీడీఓ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీ నుంచి 532, గ్రామాల నుంచి 394 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

కేటీదొడ్డిలో 1778 దరఖాస్తులు..

కేటీదొడ్డి: గృహలక్ష్మి పథకానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి 1778 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ మోహిద్దీన్ అజార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో ప్రజలు పోటెత్తారు. కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్ ఖాన్‌పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పల్లెల అభివృద్ధి

గట్టు : పల్లెలను ప్రణాళికా బద్ధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గట్టు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠ ధామాలు, పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్యాంకర్లు, ఇలా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో గట్టు ఆస్పత్రి స్థాయిని పెంచనున్నట్లు తెలిపారు. గట్టు ప్రభుత్వ ఆస్పత్రి కోసం కేటాయించిన 2 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, సర్వే చేయకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నట్లు ఎంపీటీసీ కృష్ణ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయ్ కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, ఎంపీడీఓ చెన్నయ్య, సీడీపీఓ కమలాదేవి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంపు



ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో గురువారం ఎస్‌బీఐ భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంపును గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు భారత్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, డాక్టర్ మనస్‌బాషా ఆర్థోపెడిక్, డాక్టర్ రిజ్వానా తాన్వీర్, డాక్టర్ సురేష్‌కుమార్, ఫార్మసిస్ట్ తస్లీమా బాను, ల్యాబ్ టెక్నీషియన్ రామచంద్ర నాయుడు, షబ్బీర్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకూ పోరాటం



మాట్లాడుతున్న నాగరాజు

గద్వాల అర్బన్: కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీంను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని, ఈనెల 12న చలో హైదరాబాద్ పేరుతో నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస రెడ్డి, రమేష్ కుమార్, ప్రతాప్ రెడ్డి, భీమన్న, బీజాపూర్ ఆనంద్, పరమేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీకి చెందిన ప్రభాకర్ కిడ్నీ సంబంధిత సమస్యలతో కాలం నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు గురువారం అతనికి రూ.36వేల ఆర్థిక సాయంతో పాటు ఆరు నెలలకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు అశోక్, రాజు, నరేష్, శ్రీరామ్, చందు, నాగేష్, పరమేష్ తదితరులు ఉన్నారు.

మొక్కలే మానవాళికి జీవనాధారం

ఎర్రవల్లిచౌరస్తా: మొక్కలే మానవాళికి జీవనాధారమని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఎంపీడీఓ రాఘవ అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని వేముల గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అవెన్యూప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నాటిన ప్రతి మొక్కకూ ట్రీగార్డులను ఏర్పాటు చేసి రక్షించాలన్నారు.

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని జోగుళాంబ హాల్ట్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు కథనం ప్రకారం.. చిన్న ఆముదాలపాడుకు చెందిన శరత్‌బాబు మండలంలో ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాడు. శరత్‌బాబు బైక్‌పై వెళ్తుండగా లింగన్‌వాయికి చెందిన గోవర్ధన్ బైక్‌తో వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్సకోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. శరత్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్ రూరల్ : అలంపూర్ ఎస్ఐ మడుగు రమేష్‌ను, తహసీల్దార్ మంజులను గురువారం తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డిపోగు ప్రేమదాస్, మద్దిలేటి, చిన్నోడు, జాన్, సత్యం, నాగన్న, నాగరాజు, కిరణ్‌కుమార్ ఉన్నారు.

చికెన్ సెంటర్‌లో మంటలు

గట్టు : చికెన్ సెంటర్‌లో మంటలు చెలరేగిన ఘటన గురువారం మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో చోటుచేసుకుంది. చికెన్ సెంటర్‌లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గట్టు : మండల పరిధిలోని ఆరగిద్ద గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జయన్న తండ్రి తిమ్మప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

రెండో ఏఎన్‌ఎంల నిరసన



పీహెచ్‌సీ ముందు నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

అయిజ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు గురువారం రెండో ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్‌ఎంలు మాట్లాడారు. ప్రభుత్వం రెండో ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు చిట్టెమ్మ, విజయ్ కుమారి, శ్యామల, కవిత, కృష్ణవేణి, ఎస్తేరమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

మానవపాడు: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని మాబీ, వినోదిని, కృష్ణవేణి, అనసూయమ్మ, చిట్టెమ్మలు గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ముందు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. రెండో ఎన్ఎమ్‌లను రెగ్యులరైజ్ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నసీమా, ఇందిరమ్మ, దేవమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు



ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అలంపూర్ రూరల్: పట్టణంలో మున్సిపల్ సిబ్బంది గురువారం ఇంటింటికి తిరిగి ఇంటి పన్ను వసూలు చేశారు. పన్నుకు సంబంధించిన 28 రసీదులకు రూ.34,600 వచ్చినట్లు కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. వాటికి సంబంధించిన డబ్బులను ఆన్‌లైన్‌లో జమ చేసినట్లు తెలిపారు.

మద్దూరులో గ్రామ కమిటీ ఎన్నిక

మానవపాడు: మండలంలోని మద్దూరులో గురువారం ఎమ్మార్పీస్ జిల్లా సమన్వయకర్త మస్తాన్ మాదిగ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కోసిగ మారెన్న, ఉపాధ్యక్షుడు తిమ్మన్న, మల్లెపోగు నాగరాజు, అధికార ప్రతినిధి బెందల రాచపోడి లక్ష్మన్న, మద్దిలేటి, డెవిడ్, కార్యదర్శి హనుమత్ ఎర్రన్నలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జయరాజ్, ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌డీడీ వందశాతం పూర్తి

అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎన్‌డీడీ(నులి పురుగుల నివారణ) కార్యక్రమం గురువారం వందశాతం పూర్తి అయినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూన రాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. హెచ్ఏ బాలీశ్వరయ్య శెట్టి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం



జెండాను ఊపి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గట్టు మండలానికి నూతనంగా కేటాయించిన 102, 108 వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వైద్య సేవలను విస్మరించాయని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి వైపు తీసుకెళ్తుందన్నారు. అంబులెన్స్‌లో అన్ని ఆధునిక సౌకర్యాలున్నాయని, రోగులకు తక్షణ వైద్య సేవలు అందించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్ కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు ఆరోగ్యం



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

గద్వాల వ్యవసాయం: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా, నష్టాలు ఏర్పడకుండా వేసే నివారణ టీకాలు, మాత్రల ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి డాక్టర్ శంకరయ్య అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వ్యాక్సినేషన్, మాత్రల పంపిణీ కార్యక్రమం గద్వాల మండలంలో కొనసాగుతోంది. గురువారం మండల పరిధిలోని కుర్వపల్లి, పర్మాల గ్రామాల్లో వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేయించడం వల్ల పశువుల్లో జీర్ణశక్తి పెరిగి, బలంగా, ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందన్నారు. రెండు గ్రామాల్లో 34 మంది రైతులకు చెందిన 258 ఆవులు, ఎద్దులకు, 87 గేదెలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశుసంవర్ధక సిబ్బంది మాదవీలత, ఉమాదేవి, శశికుమార్, రాముడు, కృష్ణయ్య, గోపాలమిత్రలు ప్రభాకర్, నర్సింహ, జహంగీర్, ఫణీంద్రరాజు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కేటీదొడ్డి: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించాలని సర్పంచ్ శంకరమ్మ అన్నారు. మండల పరిధిలోని సిద్దన్‌పల్లిలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో గోపాల్‌మిత్ర గోపాల్ రెడ్డి, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలి

శాంతినగర్ : ప్రతి కార్యకర్త ఒక నాయకుడిలా వ్యవహరించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని టీపీసీసీ కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధ్యక్షతన లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ నేషనల్ కోఆర్డినేటర్ ఎల్‌డీఎం ఇన్‌చార్జ్ కేతూరి వెంకటేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొంకల నాగేశ్వర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం వారు మండల కమిటీలు, గ్రామ కమిటీలను పరిశీలించి, బూత్ ఏజెంట్లను నియమించారు. మండల, గ్రామ, బూత్‌స్థాయి కార్యకర్తలు, నాయకుల పనితీరును గమనించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందనే విషయాలను చెబుతూ దిశా నిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం ఏ విధంగా పనిచేయాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేసి తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాణాను సద్వినియోగం చేసుకోండి



గొర్రెల దాణా పంపిణీ చేస్తున్న వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి

అయిజ: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గొర్రెల పంపిణీతో పాటు గొర్రెలకు దాణా పంపిణీ చేసిందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఫీడ్ ఫ్యాక్టరీ గోదాంలో గొర్రెల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 8న మండలంలోని బింగుదొడ్డికి 5 యూనిట్లు, అయిజకు ఒక యూనిట్ సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించి దాణాను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన వ్యాక్సిన్‌ను మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు వేస్తున్నట్లు తెలిపారు. గురువారం వెటర్నీ సిబ్బంది సింధనూరులో 85 పశువులకు, కిష్టాపురంలో 95 పశువులకు వ్యాక్సిన్ వేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, అధికారులు

మానవపాడు: గ్రామాల్లో నిర్వహిస్తున్న వివిధ రకాల పారిశుద్ధ్య కార్యక్రమాలు, మరుగుదొడ్లు, సెగ్రిగేషన్‌షెడ్ల నిర్మాణం, చెత్త సేకరణ, అభివృద్ధి పనులను గురువారం కేంద్రం బృందం సభ్యులు అంబికాశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల తీరును పర్యవేక్షించామన్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ రికార్డులను, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి కోసం ఆయా గ్రామ పంచాయతీలు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ, మండల ప్రత్యేక అధికారి నాగేంద్రం, ఎంపీఓ ఆంజనేయరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని రక్షిద్దాం, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు గురువారం తహసీల్దార్ మంజులకు వినతి పత్రం సమర్పించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఏమెలమ్మలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను కాపాడాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌కాంటాక్స్ పరిధిలో లేని ప్రతి కుటుంబానికీ నెలకు రూ.7,500 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఆధ్యక్షుడు జీకే ఈదన్న, నాయకులు అయ్యప్ప, మాలిక్‌బాషా, అంగన్‌వాడీ టీచర్లు , ఆశా కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపైనే మద్యం బాబుల బండ్లు

రాజోళి: మద్యం బాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. వైన్ షాప్ తెరుచుకుంటే చాలు రోడ్లపైనే మద్యం తాగుతున్నారు. రాజోళిలో మద్యం బాబుల బండ్లను రోడ్డుపై నిలపడంతో రైతులు, మహిళలు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. అసభ్య పదజాలంతో దారిన పోయేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు.